# రహస్యం

రుక్మిణమ్మ చాలా ఉత్సాహంగా వుంది తెల్లారినప్పట్నుంచీ. పెద్దనాన్నగారి మనవడి పెళ్ళికెళ్ళాలి. తొమ్మిదయ్యేసరికి పనులన్నీ పూర్తి చేసుకుంది. ముందరే చెప్పాడు సత్యం అన్ని పెళ్ళిళ్లకి, విందులకి వెళ్ళడం తనకిష్టముండదని. కనుక ఆయనకిష్టమైతే వస్తారు, లేకపోతే లేదు అని మనసు స్థిమితపరచుకుని, హాయిగా పెళ్ళిళ్ళకి, పేరంటాలకి వెళ్లడం అలవాటు చేసుకుంది రుక్మిణమ్మ. పైగా ఈ పెళ్ళికి తన వాళ్ళందరూ వస్తారు కూడా. అందుకే గబగబా తయారయింది. గాడ్రెజ్‌లోంచి పెద్ద గొలుసు, అదే ఆరువరుసల చంద్రహారం తీసి మెళ్ళోవేసుకుంది. పెళ్ళినాటిది-ఒకటికి రెండుసార్లు అనుకుంది ఈ చంద్రహారం మార్చి కొత్తగా వస్తున్న మల్లెపూలదండ చేయించుకుందామని.

"పెళ్ళినాటి వస్తువు మార్చడానికి వీల్లేదు" అన్నాడు సత్యం-అంతే, ఆయన మాటకి తిరుగులేదు ఇంట్లో.

రుక్మిణమ్మ లోపల గదిలోవున్న భర్తకి వినబడేలా "టైముకి అన్నం తినండి" అంది.

"అంటే, పస్తుంటాననుకున్నావా? నువ్వెళ్ళు" సత్యం సీరియస్‌గా టీవీవంక చూస్తూ అన్నాడు.

"పోనీ వద్దంటే మానేస్తాగా! అంత కోపందేనికి?" అంది వెంకటగిరి జరీ చర అంచులు సరిచేసుకుంటూ రుక్మిణమ్మ. రిటైరయ్యాక పెంకితనం మరీ పెరిగింది అనుకుంది మనసులో.

సత్యం మాట్లాడలేదు. "ఏదో పెద్దనాన్న సంతోషిస్తాడు. పైగా మావాళ్ళంతా వస్తారని....లేకపోతే ఇప్పుడంత దూరం వెళ్లడం నాకేమయినా సరదానా?" అంది దీర్ఘంతీస్తూ.

ఏ చిన్న విషయాన్నయినా ఇలా పెంచి పెద్దది చేయడం అలవాటు రుక్మిణమ్మకి.

"ఇప్పుడేమంటావే. నన్ను కూడా నీ వెంట రమ్మంటావు. అంతేనా" అన్నాడు సత్యం.

"అంత అదృష్టం కూడానా? నేను రమ్మనడం, మీరు రావడం - అందులోనూ మావాళ్ళ ఇళ్ళకి" మూతి తిప్పి గేటు దాటింది రుక్మిణమ్మ.

టీవీలో వస్తున్న క్రికెట్ ఆటని లంచ్‌టైమ్ వరకూ చూపి అప్పుడు భోజనం చేసి నిద్రపోయాడు సత్యం.

రుక్మిణమ్మ పెళ్ళింట్లో అడుగుపెట్టడం ఆలస్యం ఎంతో ఆప్యాయంగా పలకరించారంతా. తన తల్లితండ్రి ఢిల్లీలో వుండి రాలేకపోయినందుకు పెద్దనాన్న మనసు కొంచెం నొచ్చుకుందనిపించింది రుక్మిణమ్మకి. తన వరస అన్నలు, తమ్ముళ్ళు, ఎప్పుడెప్పుడో చూసిన పిల్లలు, బాబాయిలు...ఇలా అందర్నీ చూస్తూ ఆనందపడిపోయింది రుక్మిణమ్మ.

భోజనాలయ్యాక కబుర్లు చెప్పుకుంటున్నారంతా. పెద్దనాన్నగారి అబ్బాయి, రుక్మిణమ్మ భర్త సత్యం ఒకే కాలేజీలో చదువుకున్నారు. ఒకే ఆఫీసులో ఉద్యోగాలు చేసారు. ఇద్దరూ రిటైరయ్యారు.

“ఏమే రుక్మిణీ! మీ ఆయనకి పెన్షన్ పెరిగింది తెలుసా?” అన్నాడు నవ్వి పెద్దనాన్న కొడుకు రవీంద్ర.

“ఏమో! అవేమీ నాకు తెలియవు బాబూ. అసలు ఆయన పెన్షన్ ఎంతో తెలిస్తేకదా పెరిగిన విషయం తెలిసేదీ?” అంది రుక్మిణమ్మ.

“అదేమిటీ...తెలుసుకోవాలి నువ్వు” అన్నాడు రవీంద్ర నవ్వి.

పెళ్ళిసందడి అయిపోయింది. నాలుగయ్యేసరికి ఇల్లు చేరింది రుక్మిణమ్మ. ఆటో దిగేసరికి ఇంటికి తాళం కనిపించింది.

“ఇప్పుడే వెళ్ళారు అంకుల్” అంటూ తాళం చెవులు చేతికిచ్చింది పక్కింటి రాజీ.

“అంత అర్జంటుగా ఎక్కడికెళ్ళినట్లో? తను వచ్చేవరకూ వుండొచ్చుగా? నిజమే, అన్నయ్య చెప్పినట్లు తనేమీ కనుక్కోదేమిటి? ఎంతో విసుగ్గా బారీచీర విప్పి కాటన్ చీర కట్టుకుంది. చంద్రహారం లోపల దాచి పెట్టింది. ఎందుకో పెళ్ళి నుంచి వచ్చిన ఉత్సాహం ఒక్క నిముషంలో ఎగిరిపోయింది.

రాత్రి తొమ్మిది గంటలవుతుంటే ఇంట్లో అడుగుపెట్టిన సత్యం “పెళ్ళి బాగా జరిగిందా?” అన్నాడు రుక్మిణమ్మని చూస్తూ.

“మెళ్ళో చంద్రహారం తీసి దాచేయడం దేనికీ. నేనూ చూస్తాగా కాసేపు. అయినా దాచుకోడం దేనికి-మా అమ్మ ఎంతో ప్రేమగా చేయించింది అప్పుడు” అన్నాడు కొంటెగా.

“మేం కట్నం ఇచ్చాం, మీ అమ్మ చేయించింది. అదో గొప్పలా చెప్తారేమిటి?” అంది రుక్మిణమ్మ.

“కట్నం ఇస్తే మాత్రం చేయించాలని వుందా ఏమిటి? మావాళ్ళు మంచివాళ్ళు కనుక” సత్యం నవ్వాడు.

"ఆనాటికి ఈనాటికి అదే వస్తువుగా..."

"అంటే?"

"అదే....ఆ పెన్షన్ డబ్బులు వస్తూనే వున్నాయి. పెరుగుతూనే వున్నాయి. ఏదైనా ఓ ముద్దు ముచ్చట వుందా ఏం? చంద్రహారం వుంటే పలకసర్లు చేయించకూడదా?" అంది.

"ఓహో అదా గొడవ. ఇప్పుడు నా పెన్షన్ డబ్బులు ఏం చేస్తున్నానో, ఎలా ఖర్చు చేస్తున్నానో చెప్పాలా తమరికి. చచ్చినా చెప్పను" అన్నాడు సత్యం.

"పెళ్లికెళ్ళొచ్చావుగా. అప్పుడే అనుకున్నా నీ బుర్ర ఎవరో పాడు చేసారని."

"చాల్లేండి. మావాళ్ళకిదే పనా? అన్నయ్య అడిగాడు పెన్షన్ పెరిగింది తెలుసా అని, నాకేం తెలుసు అంటే నవ్వాడు."

సత్యానికి ఈమాటు చాలా కోపం వచ్చింది.

"ఓహో! మీ అన్నయ్య వాగుడా. వెళ్ళి చెప్పు. మా ఆయన ఇంట్లో ఒక్క పైసా ఇవ్వడు, ఏడిపించుకు తింటున్నాడని" అన్నాడు.

భర్తకి కోపం వచ్చిందని, తను ఎంత ఏడ్చి మొత్తుకున్నా పెన్షన్ వివరాలు మొత్తం తనకి చెప్పడనీ తెలుసు రుక్మిణమ్మకి.

"మా వదిన పూతరేకులిచ్చింది. తినండి" అంటూ ప్లేటులో పెట్టి తెచ్చింది.

"అక్కర్లేదు. నువ్వే తినేయ్" అన్నాడు సత్యం.

సత్యం రెండు రోజులనుంచి ఎదురు చూస్తున్నాడు పోస్టుమాన్‌కోసం. రోజూ పోస్ట్‌మాన్ వచ్చే టైముకి మెలకువగా వుండి వచ్చేవన్నీ తనే తీసుకుంటాడు.

సత్యం రిటైరయ్యాక వెంటనే వచ్చిన డబ్బంతా బాంక్‌లోనే వేసాడు. అయినా ఎంత ఖర్చు? తను, భార్యా, పిల్లలు ఎవరి దోవన వాళ్ళున్నారు. నెలనెలా వచ్చే పెన్షన్ ఏం చేస్తున్నాడో చెప్పాలంటుంది భార్య. చెపొచ్చు. కానీ తీరా చెప్పాక తను చేసే పని ఇష్టపడదు. అప్పుడు మళ్ళీ ఒప్పించాలి. ఇవన్నీ ఎందుకు-తను మగాడు, తనిష్టం. ఇంట్లో అన్నీ చూసుకుంటున్నాడుగా. ఇంకేమిటి గోల? సత్యం విసుగ్గా అటూ ఇటూ తిరుగుతూ పోస్టుమాన్ కోసం చూస్తున్నాడు.

సత్యం సవతి చెల్లెలు సుధ. తల్లి మరణిస్తే తండ్రి రెండో పెళ్లి చేసుకున్నాడు. సత్యం నాలుగేళ్ళప్పుడే తల్లి మరణించింది. పిన్ని వచ్చాక ఇల్లు చక్కబడింది. నాన్నకి కావాల్సినవి చూడ్డమే కాకుండా చిన్నవాడైనా సత్యాన్ని కూడా ప్రేమగా చేసేది. పిన్ని కూతురు సుధ. ఆ సుధ, రుక్మిణి క్లాస్‌మేట్స్. సుధ పదోక్లాసు పాసవగానే చిన్న ఉద్యోగంలో వున్న జయరామ్‌కిచ్చి పెళ్లి చేసాడు తండ్రి. అలా చెల్లెలి పెళ్ళి బాధ్యతలు ఏవీ లేకుండానే పెరిగి పెద్దవాడైన సత్యానికి చెల్లెలు సుధంటే చాలా ప్రేమ. కాలం గడిచి సుధ భర్త అనుకోకుండా హార్ట్‌ఎటాక్‌తో మరణించేసరికి ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న విశ్వానికి ఏం చేయాలో తెలియలేదు.

రుక్మిణమ్మ పుట్టింటివారు డబ్బున్నవాళ్ళు కావడం, భర్త బాగా సంపాదించడంతో మహా గర్విష్ఠి అయిన రుక్మిణమ్మ ఇంకా గర్విష్ఠి అయింది.

పైగా కూతురు, కొడుకు కూడా అమెరికాలో స్థిరపడ్డారు. స్నేహం పోయి ఒక విధమైన చిన్నచూపు సుధపై రుక్మిణమ్మకి.

రిటైరైన సత్యం సుధ కుటుంబపరిస్థితులు గమనిస్తున్నాడు.

ఆరోజు సుధ ఇంటికి వెళ్లాడు. "ఏం తోచడంలేదు అన్నయ్యా. ఒక్క ఏడాదీ చదువుంది. నెలనెలా హాస్టలుకి వాటికి ఎలా కట్టగలను?" అంది తలదించుకుని సుధ.

"ఏం చేద్దామనుకుంటున్నావు మరి" అన్నాడు సత్యం.

"ఈ ఇల్లు తాకట్టు పెట్టి కొంత డబ్బు తెస్తే వాడి చదువయ్యాక నెమ్మదిగా తీర్చుకుంటాడు. ఈయనకొచ్చే ఆ నాలుగు పెన్షన్ రాళ్ళతో ఏదో నేను గడిపేయగలను" అంది. సత్యం మాట్లాడలేదు.

"సరే ఆలోచిద్దాం" అన్నాడులేస్తూ.

సత్యం వెళ్ళిపోయాక సుధ ఆ గోడనానుకుని అలా నిలబడింది. నెలరోజులు గడిచాయి.

"అమ్మాయి! ఇటు విను -నా పెన్షన్‌లో కొంత నెలనెలా వాడికి పంపిస్తా. ఆ హాస్టలు, పుస్తకాలు అన్నీ అందులోనే గడుపుకోవచ్చు. నువ్వు ఒక్క పైసా పంపకు. అంతేగానీ, ఇల్లు తాకట్టుపెట్టి అప్పుతేవడం, అది తీర్చడం అవన్నీ నీవల్ల కావు. అయినా నీకు ఇబ్బంది వస్తే నేను ఆదుకోకపోతే ఎలా? నాన్నగారు నన్ను క్షమిస్తారా?" అన్నాడు చెల్లెలు సుధ తలనిమిరి.

గేటు దాటి బయటకెళ్లిన సత్యం మళ్లీ లోపల కొచ్చాడు.

"ఏమిటన్నయ్యా?" అంది సుధ.

"చూడమ్మా. నువ్వు పిల్లాడిని ఎలా చదివస్తున్నావో ఎవరికీ తెలియనీయకు. ముఖ్యంగా మీ వదినకి తెలిసిందా?"

సుధ తలూపింది.

తన భార్యతో చెప్తేనేం? సత్యానికి వెంటనే నవ్వొచ్చింది.

ఓ రోజు వీధిలోకొచ్చిన చీరలు బేరం చేస్తోంది రుక్మిణమ్మ. సత్యం అక్కడే వున్నాడు.

ఒక చీర తీసుకుంది.

"ఇంకొకటి తీసుకో" అన్నాడు.

రుక్మిణమ్మ తీసుకోలేదు. సత్యం నాలుగువందలు పెట్టి ఆ చీర కొన్నాడు. ఇదెప్పటి విషయం- సుధ భర్త బతికున్నప్పటి విషయం.

రుక్మిణమ్మ చాలా గొడవ చేసింది ఆ చీర సుధ కిచ్చినందుకు.

"ఏం! మీ సొంత చెల్లెలా?" అంది.

సత్యం మాట్లాడలేదు. అప్పట్నుంచీ చెల్లెలికి ఏ సాయం చేసినా రుక్మిణమ్మకి తెలియనీయదు.

సత్యం గతంలోంచి బయటకొచ్చాడు. "అయ్యగారికియ్యాల" అన్నాడు.

"ఏం, నేనున్నానుగా? ఇటియ్యి" వాడి చేతిలోరంచి లాక్కుంది. ఇక మనియార్డర్ రసీదు, ఒక భక్తిసంజీవని పుస్తకం.

"ఇటియ్యి" అన్నాడు సత్యం.

రుక్మిణమ్మ మాట్లాడకుండా పుస్తకం చేతికిచ్చింది. "ఇంతేనా, ఇంకేంరాలేదా?"

"లేదు" రుక్మిణమ్మ లోపలకెళ్ళి పోయింది.

"అదేమిటి మనియార్డర్ రసీదు రావాలిగా" అనుకున్నాడు సత్యం.

ఎందుకో రుక్మిణమ్మ రోజుకన్నా కోపంగా వుంది ఆ రోజు.

"ఊళ్లో అందరికీ పంచి పెడుతుంటే ఇంక కొంపకేం మిగుల్తాయి" అంది ఎవర్ని ఉద్దేశించో ఏమిటో!

లోపల గదిలో నున్న సత్యం వింటున్నాడు.

"అయినా ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికెక్కిందనీ.... ఎవరి తాహతులో వాళ్ళుండాలి" - ఈ మాటలూ విన్నాడు.

ఇక ఆగలేకపోయింది.

"ఏం, నాకు చెప్తే వద్దంటావా? ఈ రహస్యాలేమిటి?" అంది గబగబా గదిలోకొచ్చి.

"ఏ రహస్యాలు?" అన్నాడు సత్యం.

"ఇదే" సత్యం ముఖాన విసిరికొట్టింది మనియార్డర్ రసీదు.

సత్యం ఫక్కున నవ్వాడు.

"హమ్మయ్య. ఇంక రహస్యాలులేవు. అవును....వాడి చదువయ్యేవరకు ఆ బాధ్యత నేను తీసుకున్నాను" ఆ తరువాత సత్యం మాట్లాడలేదు.

"ఆ బాధ్యత అయిపోయాక నీకు గొలుసులే గొలుసులు, గాజులే గాజులు."

తండ్రిలేని విశ్వం కళ్ళముందు కదిలాడు-పాపం!

రుక్మిణమ్మ మనసులో ఒక్కసారి సుధమీద జాలి కలిగింది. నీ ఈ గాజులు, గొలుసులకన్నా ఆ పసివాడికి నాలుగు అక్షరం ముక్కలొస్తే పాపం అదీ, వాడు హాయిగా బతుకుతారు, నిజమే! తన భర్త చేస్తున్నది మంచి పనే. కాకపోతే నాకెందుకు చెప్పకూడదు? రుక్మిణమ్మ భర్తకేసి చూసింది ఆప్యాయంగా.

"మీరు ఓ మంచి పని చేస్తానంటే నేను వద్దంటానా? నాకూ చెప్పొచ్చుగా" అంది.

సత్యం చెవులని నమ్మలేకపోయాడు. రుక్మిణి మాటలేనా ఇవి?

"ఈ రహస్యాలు నాకు నచ్చవు బాబూ" అంది.

"నాకూ నచ్చవు బాబూ. కాకపోతే అలనాడు సీతమ్మ అందిట నీలాగా 'ఏం ఆ రాముడు నాతో చెబితే ఒప్పుకోనా, అరణ్యాలకు వెళ్ళనా' అని. ఆవిడకి రాముడి మీద ఇలానే కోపం వచ్చింది, నీలాగే అంది 'ఈ రహస్యాలెందుకు, నాకూ చెప్పొచ్చుగా అని" అన్నాడు సత్యం ఉత్సాహంగా.

"రహస్యాలొద్దు. అంతే. రేపే చెబుతా. మా అన్నయ్యకి మా ఆయన పెన్షన్ ఏం చేస్తున్నాడో అనే విషయం. వాళ్ళు తలో విధంగానూ అనుకుంటున్నారు" అంది రహస్యంగా రుక్మిణమ్మ.

"షష్టిపూర్తి కథలు"

- ఆంధ్రభూమి సచిత్ర మాస పత్రిక జనవరి 2001